రోడ్డు పక్కనే..రెడిమిక్స్

మిగులు కాంక్రీట్‌తో పొంచి ఉన్న ప్రమాదం
● ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

కాజీపేట అర్బన్ : కాజీపేట మండలంలోని కడిపికొండ నుంచి భట్టుపల్లి మీదుగా ఉర్సుగుట్టకు వెళ్లే రహదారిపై కాంక్రీట్ మిగులు వ్యర్థాలు పారబోస్తున్నారు.దీంతో రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రమాదం తప్పదేమోనని వాహనదారులు భయపడుతున్నారు. సీసీ రోడ్లు, ఇళ్ల నిర్మాణంలో ఆధునిక టెక్నాలజీతో రెడిమిక్స్‌ను ఉపయోగిస్తున్నారు. నిర్మాణం అనంతరం రెడిమిక్స్ వాహన యజమానులు, డ్రైవర్లు మిగిలిన రెడిమిక్స్‌ను అక్కడే వదిలేసి రాకుండా రోడ్డు పక్కన కుప్పలుగా పారబోసి చేతులు దులుపుకుంటున్నారు.


రోడ్డు పక్కన పారబోసిన రెడిమిక్స్ వ్యర్థాలు

వాహనదారులకు తప్పని తిప్పలు
కడిపికొండ నుంచి ఉర్సుగుట్టకు వెళ్లే రోడ్డుపై సరైన వీధి దీపాలు లేకపోవడంతో వాహనాల వెలుతురులో ప్రయాణం కొనసాగిస్తున్నారు. కాగా రోడ్డు పక్కన పోసిన రెడిమిక్స్ కుప్ప గట్టిపడడంతో రాత్రివేళ గమనించని ప్రయాణికులు వాటిని ఢీకొని పడిపోతున్నారు.

అధికారులు చర్య తీసుకోవాలి

రెడిమిక్స్ వ్యర్థాలు రోడ్డు పక్కన పారబోయడంతో ప్రమాదాల బారిన పడుతున్నాం. అధికారులు రెడిమిక్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి. కడిపికొండ నుంచి న్యూశాయంపేటకు ప్రయాణం చేసే సమయంలో రెడిమిక్స్ రోడ్డు పక్కన కుప్పగా ఉండడంతో గమనించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.
- రామిండ్ల బాబురావు, న్యూశాయంపేట

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు


మీడియా అకాడమీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వరంగల్ జర్నలిస్ట్ సంఘాల నాయకులు

● దీపావళి నాటికి సానుకూల నిర్ణయం

నయీంనగర్ : గ్రేటర్ వరంగల్ పరిధిలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్ బీఆర్‌కే భవన్ మీడియా అకాడమీ కార్యాలయంలో చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గతంలో సొసైటీలకు కేటాయించిన స్థలాలతో పాటు మరికొంత స్థలాన్ని సేకరించి అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సొసైటీల బాధ్యులు, యూనియన్ నాయకులు, సిక్స్‌మన్ కమిటీ సమష్టిగా అర్హులైన జర్నలిస్టుల జాబితాను రూపొందించి ఇవ్వాలని సూచించారు. అనుకున్నట్లు జరిగితే దీపావళి పండుగ నాటికి జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సానుకూల నిర్ణయం వెలువడగలదని, ఇందుకు అందరూ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ యూనియన్‌ల నాయకులు, సొసైటీల బాధ్యులు, సిక్స్‌మన్ కమిటీ బాధ్యులు వల్లాల వెంకటరమణ, గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, సీహెచ్. సుధాకర్, బిఆర్.లెనిన్, బొక్క దయాసాగర్, మస్కపురి సుధాకర్, పిన్న శివకుమార్, కె.అనిల్‌కుమార్ గౌడ్, పి.వేణుమాధవ్, బొల్లారపు సదయ్య, పివి.మదన్‌మోహన్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



విద్యారణ్యపురి : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ (భారత విద్యార్థి ఫెడరేషన్)ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని అశోక జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణలో వేలకోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు లేక అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. నాయకులు పవన్‌కుమార్, అభిషేక్, ప్రదీప్‌సాయి, సందీప్‌రాజ్, కుమార్, అనూష, ప్రవళిక, అంజలి, శిరీష పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ విడుదల చేయాలి
ఖిలా వరంగల్ : ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్, ఏఐఎస్‌బీ జిల్లా కో కన్వీనర్ పెండ్యాల సతీష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎండీ మిషన్ సుల్తానా డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

వరంగల్ చౌరస్తా : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు.

రతన్ టాటాకు నివాళి

కేయూ క్యాంపస్ : నైతిక విలువలకు కట్టుబడిన వ్యక్తి రతన్ టాటా అని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. బుధవారం కాకతీయ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగంలో వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఆచార్య బి.సురేష్ లాల్ అధ్యక్షతన దివంగత రతన్ టాటా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ బాధ్యులు రతన్‌టాటా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

హసన్‌పర్తి : కులం పేరుతో దూషించిన యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో హసన్‌పర్తి సెంటర్‌లో బుధవారం ధర్నా నిర్వహించగా జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికుల పట్ల అకారణంగా దూషించిన హసన్‌పర్తికి చెందిన చెన్నూరి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా శ్రీనివాస్ ఇదే ప్రాంతానికి చెందిన జవాన్‌ను కులం పేరుతో దూషించాడని తెలిపారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మంద సంపత్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, మండల కార్యదర్శి అశోక్, మున్సిపల్ యూనియర్ కార్యదర్శి బొంగు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సంగాల రాజు,తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రతపై అవగాహన ఉండాలి


కాజీపేట అర్బన్: మాట్లాడుతున్న బిద్యాధర్ సుబుదీ


రామన్నపేట: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రతన్‌సింగ్

రామన్నపేట : ఆహారాన్ని వృథా చేయకుండా అందరికీ లభించే విధంగా పొదుపుపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ రతన్ సింగ్ అన్నారు. బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నగరంలోని ఏవీవీ కళాశాలలో 'మన భవిష్యత్ కోసం అందరికీ పౌష్టికాహారం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం, కరపత్రము ఆవిష్కరణ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ భుజంగ రెడ్డి, అధ్యాపకులు టి.వాసుదేవులు, డాక్టర్ శ్రీధర్, చండీశ్వర్, జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖిలా వరంగల్ : వరంగల్‌లోని శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ మండల పరుశురాములు ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం శారదాబాయి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఫాస్ట్ ఫుడ్‌తో అనారోగ్యం
హసన్‌పర్తి : ఫాస్ట్ ఫుడ్‌తో అనారోగ్యం పాలవుతామని కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్ అన్నారు. 56వ డివిజన్ గోపాలపురంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఓరుగల్లు రక్షణ సమితి సభ్యుడు కజాంపురం దామోదార్, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగందర్, సభ్యులు మలహాల్‌రావు, కొండబత్తిని రాజేందర్, గంటిసాంబయ్య, ఉపేంద్రాచారి, మార్క రవీందర్, రాజశేఖర్, రాజేందర్, సాంబయ్య, రాజమౌళి, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

నిట్‌లో వరల్డ్ ఫుడ్ డే..
కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో బుధవారం వరల్డ్ ఫుడ్ డే నిర్వహించారు. ఫంక్షనల్ ఫుడ్స్ అండ్ స్మార్ట్ ప్రొటీన్స్ ఫ్యూచర్ ఆఫ్ న్యూట్రీషన్ అనే థీంతో నిర్వహించిన ఫుడ్ డే వేడుకల్లో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ పాల్గొని మాట్లాడారు. బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ ఫుడ్ డేను నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

విద్యార్థులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘాల బాధ్యులు



హనుమకొండ: సమావేశంలో మాట్లాడుతున్న బొట్ల మనోహర్

● వామపక్ష విద్యార్థి సంఘాల డిమాండ్

విద్యారణ్యపురి : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలని కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరపాలి.. విద్యార్థులకు న్యాయం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, యూఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ, మరో పీడీఎస్‌యూ సమావేశాన్ని బుధవారం హనుమకొండలో నిర్వహించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి , ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారావు , ఏఐఎస్‌ఏబీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్‌నవీద్, యూఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ రాజేష్‌నాయక్‌లు మాట్లాడారు. యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ, పీజీ కళాశాలలకు మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంటును ప్రభుత్వం విడుదల చేయడం లేదన్నారు. దీంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు బంద్‌ను పాటిస్తున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకొని ప్రైవేటు విద్యా సంస్థల యజామాన్యాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఆయా సంఘాల బాధ్యులు వేల్పుల చరణ్, కె.కుమార్, వంశీ మోక్షజ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు యాజమాన్యాలతో చర్చలు జరపాలి
ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు శ్రీకాంత్, పవన్, తిరక్, చరణ్, అఖిల్, భువన్, అరవింద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి


హసన్‌పర్తి: నిరసన తెలుపుతున్న బాధ్యులు

హసన్‌పర్తి : సనాతన ధర్మ పరిరక్షణకు హిందువులు క్షేత్ర పాలకులుగా ముందుండాలని ప్రముఖ పురోహితులు దహగం రమేశ్‌శర్మ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం నిరసన చేపట్టారు. హసన్‌పర్తి నగర హైందవ ధర్మ పరిరక్షణ ప్రముఖ్ గురుమూర్తి భద్రదేవ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్ శర్మ మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయ ఆచారాన్ని కాపాడాలన్నారు. ఈకార్యక్రమంలో పురోహితులు వేదాంత సంపతాచార్యులు, గురుమూర్తి గురుదత్, కాజీపేట వెంకటస్వామి, పెద్దమ్మతల్లి ఆలయ అర్చకులు శ్రీనివాస్, శ్రీరాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, కార్పొరేటర్ శివకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టల కుమారస్వామి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారపల్లి రాంచెంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, మేకల హరిశంకర్ పాల్గొన్నారు.

వినతి
వరంగల్ చౌరస్తా : ఆలయాల్లో రాజకీయ జోక్యం సరికాదని, అర్చకుల మధ్య వివాదాలు సృష్టిస్తున్నారని చాత్తాద శ్రీవైష్ణవ సమైక్య వేదిక ద్వారా తమకు న్యాయం చేయాలని గోవిందరాజుల గుట్ట ఆలయ అర్చకులు సమైక్య వేదిక ప్రతినిధులకు బుధవారం విజ్ఞప్తి చేశారు. దేవాదాయ స్థలాన్ని కాజేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని, పలుమార్లు దేవాదాయ శాఖ ఉన్నతధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని పేర్కొన్నారు. గోవిందరాజ గుట్ట ప్రధానార్చకుడు వారియోగుల శ్రీనివాస స్వామి, అర్చకులు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

కార్పొరేషన్ పదవి ఇవ్వాలి
హన్మకొండ : డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ పదవి ఇవ్వాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్ చేశారు.ఈమేరకు బుధవారం ప్రజా సంఘ నాయకుల సమావేశం హనుమకొండలో జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రామకృష్ణ ట్రస్టు, కె.మ్యాక్స్ సంస్థ ద్వారా పదేళ్లుగా అనేక రంగాల్లో పేదలకు చేయూతనందిస్తూ వారి పురోగతికి రామకృష్ణ కృషి చేస్తున్నారన్నారు.

డ్రెయినేజీలో పేరుకుపోయిన ముగుగు

మడికొండ : గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ మడికొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మురుగు కాల్వలో చెత్త చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ సిబ్బందికి సమచారం ఇచ్చిన స్పందించడం లేదన్నారు.

నేటినుంచి వాల్మీకి జయంతి వేడుకలు
మడికొండ : నేటినుంచి మడికొండలోని పెద్దమ్మ దేవాలయం వద్ద ఉన్న వాల్మీకి ఆలయంలో నేడు (గురువారం) సాయంత్రం పూజకార్యక్రమం, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వాల్మీకి సంఘం అధ్యక్షుడు లింగమూర్తి తెలిపారు.

వృద్ధురాలి మృతి
హసన్‌పర్తి : అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలు పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్య చేసుకుంది. నాగారం గ్రామానికి చెందిన పబ్బా రాజేశ్వరీ (80)కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యం తీసుకున్నప్పటికీ వ్యాధి నయం కాలేదు. దీంతో మానసిక వేదనకు గురై పురుగుల మందు తాగి మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి కుమారుడు రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సదస్సును జయప్రదం చేయండి
వరంగల్ : బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు తాటి పాముల వెంకట్రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగే ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆర్.కృష్ణయ్య, రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, బీసీ నేతలు ఎన్. బాల మల్లేష్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

స్టేషనరీ అందజేత
హన్మకొండ : సుబేదారిలోని బాలసదన్‌లో బుధవారం విద్యార్థినులకు జెన్నీ ట్రస్టు ఆధ్వర్యంలో స్టేషనరీ అందజేశారు. జెన్నీ ట్రస్టు సభ్యులు కిరణ్ రాజ్, చంద్రశేఖర్ ఉన్నారు.

క్రీడాకారులకు దుస్తులు..
వరంగల్ : సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ వరంగల్ బాలికల జట్టు క్రీడాకారులకు బుధవారం శరత్‌చంద్ర మల్టీస్పెషియ ఆస్పత్రి ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు అందజేసి అభినందించారు. డాక్టర్ పి.సాంబశివరావు, టి.రాజేందర్, కృపామేరీ, డాక్టర్ నవీన్, పి.అశోక్‌బాబు, కిరణ్, శివప్రసాద్, స్వప్న, భవాని, సుధాకర్, నరేందర్, సందీప్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్స్, పెన్నులు..
కాశిబుగ్గ : వరంగల్ 35వ డివిజన్ శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గంగిశెట్టి మధుర అమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు అందజేశారు. ట్రస్టు సభ్యులు గంగిశెట్టి జగదీశ్వర్, హెచ్‌ఎం శ్రావణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.28 కోట్ల నిధులు మంజూరు
రామన్నపేట : శిథిలావస్థకు చేరిన వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవన నిర్మాణానికి రూ. 28 కోట్ల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1955 సంవత్సరంలో నిర్మించిన ఈ భవనాన్ని 2014 సంవత్సరంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన బృందం సభ్యులు సందర్శించి ఈ భవనం ఇంకా పదేళ్ల కన్న ఎక్కువగా ఉపయోగించుకోవడానికి వీలు లేదని నిర్ధారించారు. అలాగే కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షాలకు కళాశాలలోని పలు తరగతి గదుల్లో నీరు ఉరవడాన్ని అధికారులు సైతం గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించారు.

విశతంతువులు మనోధైర్యంతో ఉండాలి


చేయూతలో పాల్గొన్న వితంతువులు, పిల్లలు

కాజీపేట రూరల్ : వితంతువులు మనోధైర్యంతో ముందుకు సాగుతూ వారి పిల్లలను సమర్థవంతులుగా తీర్చిదిద్దాలని జనవికాస ప్రెసిడెంట్ లూర్దుమర్రెడ్డి అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ బాలవికాస సెంటర్‌లో బుధవారం మూడో బ్యాచ్‌లో యువ వితంతువులకు వారి పిల్లలకు జనవికాస సంస్థ చేయూత విద్యకు అవసరమైన రూ.12 లక్షల విలువ గల బ్యాగులు, పుస్తకాలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో లూర్దుమర్రెడ్డి మాట్లాడుతూ జనవికాస తరపున వేలాది మంది యువ వితంతువులకు సోఫార్ కెనడా దాతల నుంచి సహకారాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళా అభివృద్ధి పథక ప్రోగ్రాం మేనేజర్ లత మాట్లాడుతూ వితంతువుల పిల్లలు ఉన్నతంగా చదువుకొని భవిష్యత్‌లో ఉన్నతస్థానంలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళాభివృద్ధి సీనియర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సుజాత, వరంగల్, దంతాలపల్లి, నాగర్‌కర్నూల్, చాదర్‌ఘట్, హుజురాబాద్, మరిపెడ, జమ్మికుంట నుంచి 387 మంది వితంతువులు వారి పిల్లలు పాల్గొన్నారు.

పత్తిలో తేమను 18 శాతంగా నిర్ణయించాలి

కాశీజీ సెంటర్ : పత్తిలో తేమను 18 శాతంగా నిర్ణయించి కొనుగోలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) నాయకులు కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణిని కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. నాయకులు శ్రీనివాస్, రాచర్ల బాలరాజులు మాట్లాడుతూ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు పత్తికి మద్దతు ధర క్వింటాకు రూ.7,525 గా ప్రకటించారని గుర్తు చేశారు. అందువల్ల తేమ శాతం 18గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కాశిబుగ్గ : రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్,కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య శాయంపేట రైల్వే గేటు సమీపం అప్‌లైన్‌లో బుధవారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ పి.సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 30-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, 5.6 ఎత్తు, చామన చాయ రంగు కలిగి ఖాకీ పాయింట్, మల్టికలర్ షర్టు ధరించి ఉన్నాడన్నారు. మృతుడి కుడి చేయిపై అన్న అని తెలుగులో, భుజంపై ఇంగ్లిషులో ప్రభ అని పచ్చబొట్లు గుర్తులు ఉన్నాయన్నారు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కేసు నమోదు చేసి మృతదేహన్ని ఎంజీఎం మార్చురీకి తరలించామని సీఐ తెలిపారు. వివరాలు తెలిస్తే జీఆర్పీ స్టేషన్‌లో గాని, 97017 47014, 87126 58585 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హసన్‌పర్తి : చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు (గురువారం) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ అశోక్ తెలిపారు. భీమారం, సత్యసాయికాలనీ, బ్యాంక్ కాలనీ,యాదవనగర్, అలకానంద కాలనీ, కాకతీయ నగర్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రీడలతో శారీరక దృఢత్వం


మామునూరు : క్రీడలు మానసిక, శారీరక దృఢత్వానికి దోహద పడుతాయని టీఎస్ఎస్పీ కమాండెంట్ బి.రామ్ ప్రకాశ్ పోలీస్ శిక్షణార్థులకు సూచించారు.ఈమేరకు బుధవారం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో పరిపాలనాధికారుల ఆధ్వర్యంలో శిక్షణార్థులకు ఇంటర్ కాయ్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 పోటీలు ప్రారంభమయ్యాయి. కృష్ణ ప్రసాద్, శ్రీనివాసరావు, వీరన్న, శోభన్, కిరణ్, రవి సర్వర్, రాజిరెడ్డి, చంద్రన్న ,రమేష్, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ఖిలా వరంగల్ : వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లో బుధవారం మహిళలకు హక్కులు, చట్టాలపై సఖిసెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సఖి సెంటర్ ప్రతినిధులు తిరుమల, స్వప్న మాట్లాడారు. బాలికల రక్షణ, భద్రత కోసం గృహహింస, బాల్య వివాహాల నిరోధక, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌పీలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


అనస్థీషియా దినోత్సవం


ఎంజీఎం : ఎంజీఎంలోని అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ మురళీ హాజరై మాట్లాడారు. విలియం టీజీ మోర్టన్ 1846లో మొదటిసారి డైథైల్ ఈథర్‌ను ఉపయోగించి దవడ సంబంధిత ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించడాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 16న ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని నిర్వహించుకుంటామని తెలిపారు.అనస్తీసియా విభాగాధిపతి డాక్టర్ హనుమంతరావు, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

బొడ్రాయి వార్షికోత్సవం


ఖిలా వరంగల్ : వరంగల్ ఫోర్ట్ రోడ్డు రుద్రమాంబనగర్‌లో బుధవారం బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల నేతృత్వంలో అమ్మవార్లకు పంచామృతాభి, జలాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు అపరాజు సారంగపాణి, అచ్చ వినోద్‌కుమార్, ఎనుకంటి రాజు, నల్లకుంట రవికుమార్, కార్పొరేటర్ ఉమ, నాగరాజు, రాజు, క్రాంతి, సురేష్, రవి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


వరంగల్ చౌరస్తా : నీట్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 877 ర్యాంక్ సాధించిన పంథిని గ్రామానికి చెందిన విద్యార్థి చరిష్మాను జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. బుధవారం వరంగల్ మేదరవాడలోని సభ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్ మాట్లాడుతూ అత్యున్నత స్థానానికి వెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

జీఓలను సవరించాలి

న్యూశాయంపేట : ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఇంటింటి సర్వే జీఓ 18, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కమిటీల ఏర్పాటు జీఓ 33లను సవరించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బీఆర్ఎస్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు మహ్మద్ నయీముద్దీన్ ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం జారీచేసిన జీఓలో బీసీ, ఎస్సీ, ఎస్టీలను చేర్చి మైనారిటీ పదాన్ని చేర్చకపోవడం శోచనీయమన్నారు. ఇంటింటి సర్వే, ఇందిరమ్మ కమిటీలలో ముస్లింలను చేర్చితే వారి సామాజిక, ఆర్థిక విద్యా పరిస్థితులను బాగు చేయడానికి అవకాశం దక్కుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు.